
సాక్షి గుంటూరు

మంగళవారం : 3 : జూన్ : 2025



గుట్టలు తొలగించేది ఎప్పుడో!

తెనాలిఅర్బన్: పట్టణంలోని తూర్పు కాల్వలో ఉన్న వ్యర్థాలను ఇరిగేషన్ అధికారులు పక్కన రోడ్డుపై వేశారు. ఇలా జరిగి 10 రోజులు దాటుతున్నా తొలగించలేదు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువ కు 5,292 క్యూసెక్కులు విడుదలవుతోంది.



శివాలయానికి బారికేడ్లు విరాళం

పెదకాకాని: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం ఇర్లపాడుకి చెందిన ఆరుమళ్ల వెంకటరావు, అనూష దంపతులు 25 బారికేడ్లను శివాలయానికి సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

అర్జీదారులను పదేపదే తిప్పుకోవద్దు

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: దూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని, వారిని పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి అధిక సమయం తీసుకుంటున్న అధికారులను గుర్తించామన్నారు. అర్జీదారుడిని పదే పదే తిప్పుకోకుండా చూడాలన్నారు. అనంతరం వచ్చిన 206 అర్జీలను ఇన్‌చార్జ్ కలెక్టర్ తోపాటు డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

6న ఐటీఐ అభ్యర్థులకు కౌన్సెలింగ్

మాచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మాచర్లలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో కౌన్సెలింగ్ జరుగుతుందని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు సోమవారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్స్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు మాచర్ల ఐటీఐ కాలేజీలో సంప్రదించాలన్నారు.

నేడు లక్ష్మీ వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం



పాత పాలువాయి(రెంటచింతల): పాత పాలువాయి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వినాయకస్వామి ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి శివ ప్రసాద్ సోమవారం తెలిపారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

ఘనంగా త్రిశక్తి పీఠం నాలుగవ వార్షికోత్సవం



పెదకూరపాడు: పెదకూరపాడులోని మహాలక్ష్మీ మహా సరస్వతి సమేత శ్రీ వాసవీ మాత దేవస్థానం నాలుగో వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో యజ్ఞ హోమాది కార్యక్రమాలు జరిగాయి. అమ్మవార్లను చందనంతో అలంకరించారు. సోమవారం రాత్రి భక్తులకు వేద ఆశీర్వచనాలు నుంచి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బావిలో పడి విద్యార్థి మృతి

నూజెండ్ల: పొలంలోని వ్యవసాయ బావిలో జారిపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని తంగారాల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పమిడి ఏడుకొండలు, నాగరాజ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ (21) బీటెక్ రెండో సంవత్సరం గుంటూరులో చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన ఏడుకొండలు తండ్రికి సాయంగా పొలం వెళ్లాడు. దాహం తీర్చుకోవటానికి బావిలో దిగాడు. ఆ క్రమంలో జారిపడటంతో బావి లోతుగా ఉండటంతో మునిగిపోయి ఉంటాడని బంధువులు భావిస్తున్నారు. బావి సుమారు 25 అడుగుల లోతు ఉంటుందని, 6 ఇంజన్లు సాయంతో నీరు తోడటంతో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

అరాచకం ఖాకీచకం



- రెడ్‌బుక్ నిర్మాత లోకేష్ జిల్లాలో తందనా అంటున్న పోలీసులు
- వందల మందిపై అక్రమ కేసులు
- పాత కేసులు బయటకు తీసి అక్రమ అరెస్టులు
- సోషల్ మీడియా కార్యకర్తలను పలు జిల్లాల్లో కేసులు పెట్టి తిప్పిన వైనం
- ఆటవిక రాజ్యాన్ని తలపిస్తూ రోడ్డు పైనే అరికాలి కోటింగ్
- పోలీస్ వేధింపులతో మనస్తాపం చెంది ఒక వ్యాపారి ఆత్మహత్య
- పోస్టుమార్టం చేయకుండానే మృతదేహం తరలింపు

నేడు తెనాలికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక

రెడ్‌బుక్ రాజ్యాంగం కేరాఫ్ గుంటూరు



తెనాలి ఐతా నగర్‌లో నడిరోడ్డుపై యువకులకు అరికాలి కోటింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెడ్‌బుక్ రాజ్యాంగానికి గుంటూరు జిల్లా కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. రెడ్‌బుక్‌ను ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహించే జిల్లా కావడంతో పోలీసులు మరింత అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే పలు పాత కేసులు తిరగదోడి వందల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులకు అడ్డులేకుండా పోయింది. తెనాలి పోలీసులు ఒక కేసులో నిందితులకు నడిరోడ్డుపై అరికాలి కోటింగ్ ఇచ్చి తమ ప్రతాపం చూపించారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా, ఎస్సీ కమిషన్ వివరణ అడిగినా బాధ్యులను ప్రభుత్వం వెనకేసుకొస్తోంది.

అక్రమ కేసులు

- వైఎస్సార్‌సీపీలో చురుగ్గా ఉండే నేతలను టార్గెట్ చేశారు. పెదనందిపాడు మండలం వరగానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముల్లమూరి హరిప్రసాద్ (నాని)పై టీడీపీ నేతలు దాడిచేసి హత్య చేశారు.
- మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై అక్రమంగా 12 కేసులు పెట్టి జైలులో పెట్టారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత మళ్లీ హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడిలో పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిలతో పాటు మరో 42 మందిపై కేసులు నమోదు చేశారు.
- దుగ్గిరాల మండలంలో కౌంటింగ్ రోజు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తపై దాడి చేయడానికి వచ్చిన టీడీపీ కార్యకర్తలను అడ్డుకునే సమయంలో ఓ వ్యక్తి గాయాల పాలై మృతి చెందగా, ఈ కేసులో సోషల్ మీడియా కార్యకర్త కరీమ్‌తో పాటు జెడ్పీటీసీ భర్త వీరయ్యతో పాటు జాన్సన్, మరో 20 మందిపై హత్య కేసు నమోదు చేశారు. తాజాగా వీరయ్యపై మరో మూడు కేసులు నమోదు చేశారు.
- ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరెడ్డిని ఉద్దేశపూర్వకంగా బండితో గుద్దడంతో వెంకటరెడ్డి మృతి చెందగా, వైఎస్సార్ సీపీ నాయకులపైనే కేసులు నమోదు చేశారు. దానికి ప్రతీకారంగా ఎన్నికలైన ఆరు నెలల తరువాత వైఎస్సార్ సీపీ నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, మేకా వెంకటరామిరెడ్డిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.
- సోషల్ మీడియా రాష్ట్ర కో–ఆర్డినేటర్ మేకా వెంకటరామిరెడ్డిపై 18 కేసులు నమోదు చేశారు. మహిళా నాయకురాలు పాలేటి కృష్ణవేణిపై ఒక కేసు నమోదు చేశారు.
- మంగళగిరి రూరల్ పరిధిలో జరిగిన చిన్న గొడవలను ఆసరాగా 10 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బెదిరించి.. ఆత్మహత్యకు పురిగొల్పి

బంగారం షాపులో పనిచేసే వ్యక్తి బంగారంతో పరారు అయ్యాడన్న కేసులో, తెనాలిలో బంగారం బట్టీ నిర్వహించే సిద్దేశ్ అనే వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి తమదైన శైలిలో మాట్లాడటంతో అదేరోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక కేసులో రిసీవర్‌గా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే పోలీసు మాన్యువల్ ప్రకారం పోస్టుమార్టం చేయించాలి. అయితే కుటుంబ సభ్యులు అడిగినందున, ఫిర్యాదు ఏమీ లేనందున పోస్టుమార్టం చేయించలేదని పోలీసులు చెప్పడం గమనార్హం. ఈ కేసు తమకు చుట్టుకుంటుందన్న భయంతో సిద్దేశ్ కుటుంబ సభ్యులు, యూనియన్ సభ్యులపై ఒత్తిడి తీసుకువచ్చి మృతదేహాన్ని వారి స్వస్థలానికి ఆఘమేఘాలపై పంపించేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెనాలి పోలీసుల పైశాచిక దాడికి గురైన బాధితులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి పర్యటనకు వస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న సిద్దేశ్ (ఫైల్)

ఈ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోంది...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద, సోషల్ మీడియా కార్యకర్తల మీద అక్రమ కేసులు బనాయించడంతోపాటు అనేక కేసుల్లో థర్డ్ డిగ్రీలు ప్రయోగిస్తూ క్రూరంగా వ్యవహరిస్తోంది. తెనాలిలో అత్యంత దారుణంగా చట్టాలకు వ్యతిరేకంగా పోలీసులు నడిరోడ్డు మీద నిందితులను కూర్చోబెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటే అది చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యమే. హైకోర్టు, సుప్రీంకోర్టు అలాగే మానవ హక్కుల సంఘానికి సంబంధించి సుమోటోగా కేసు రిజిస్ట్రేషన్ చేసి తక్షణమే దాడికి పాల్పడ్డ సీఐలను, వారికి సహకరించిన వారిని సస్పెండ్ చేయాలి. గురజాలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎక్కడో హైదరాబాదులో పనిచేసుకుంటూ ఒక ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చిన హరికృష్ణను తెలుగుదేశం పార్టీ నాయకులకు కారులో ఎత్తుకొని వెళ్లి చిత్రహింసలకు గురిచేసి అతని మీద కూడా థర్డ్ డిగ్రీ ప్రయోగించి నడవలేని విధంగా కొట్టినటువంటి సీఐ భాస్కర్‌ని కూడా తక్షణమే సస్పెండ్ చేయాలి. మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ మీద అక్రమ కేసులు బనాయిస్తూ పోతున్నారు . ఇప్పటి వరకు 8 కేసులు కేసులు నమోదు చేశారు. పీడీ యాక్ట్ పెడితే దానికి సంబంధించి హైకోర్టుకు వెళితే పీడీ యాక్ట్‌ను కొట్టి వేసింది. అయినా మళ్లీ దొంగతనం కేసు పెట్టి లోపల పెట్టడం అన్యాయం.

–పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, అప్పటి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా పదవి వచ్చిన సమయంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేదంటూ కూటమి నేతలు వీఆర్‌ఓ చేత అక్రమ ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేశారు.
- తాడికొండ మండలం కంతేరు గ్రామంలో రాజకీయ కక్షతో ఎంపీటీసీ, దళిత మహిళ వలపర్ల కల్పనపై అక్రమంగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కంతేరు గ్రామానికి చెందిన జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన కళ్లం హరికృష్ణారెడ్డిపై కూడా అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించారు.
- తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో దళితులపై దాడులు నిర్వహించి ఇబ్బందులకు గురిచేయడంతో గ్రామంలో 20 మంది ఎస్సీలు గ్రామంలో లేకుండా వేరు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. ఇప్పటికీ వారు గ్రామానికి రాలేదు.
- ఫిరంగిపురం మండలం గరుడాచలం పాలెంలో ఎన్నికల అనంతరం కూటమి నేతలు దళితులపై దాడులు చేసి ఎదురు చెప్పిన వారిపై అక్రమ కేసులు నమోదు చేశారు. ఫిరంగిపురం మండలం పొనుగుపాడు గ్రామంలో అగ్రవర్ణాలు కూటమి ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తమకు రహదారి సౌకర్యం కోసం చర్చి ప్రహరీని వందలాది మంది పోలీసులను మోహరింప చేసి కూల్చి వేశారు. ఎదురించిన వారిపై అక్రమ కేసులు బనాయించారు.
- వైఎస్సార్ సీపీ వట్టిచెరుకూరు మండలం మండల కన్వీనర్ మన్నవ వీర నారాయణపై అక్రమంగా కూటమి నేతలు కేసులు నమోదు చేశారు.

వెన్నుపోటు చంద్రబాబుకు అలవాటే..!



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, పోతిన మహేష్, మోదుగుల, నూరిఫాతిమా తదితరులు

- నాడు ఎన్టీఆర్‌కు..నేడు హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు
- బాబు మోసాలను రాష్ట్ర ప్రజానీకానికి తెలియజెప్పేందుకే వెన్నుపోటు దినం కార్యక్రమం
- ప్రజలంతా పాల్గొని చంద్రబాబు మెడలు వంచైనా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్: వెన్నుపోటు అంటే గుర్తుకువచ్చేది చంద్రబాబే అని నాడు ఎన్టీఆర్‌ను.. నేడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని మోసం చేసి చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. జూన్ 4న జరగనున్న వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేసేందుకుగాను సోమవారం పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సన్నాహక సమావేశం స్థానిక బస్టాండ్ ఎదురుగా గల తూర్పు కార్యాలయంలో జరిగింది. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా అధ్యక్షతన వహించారు. అంబటి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడం కోసం అమలుకాని హామీలు ఎన్నో ఇచ్చారన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలనైనా అమలు చేస్తున్నారా.. అంటే వాటిని కూడా నిలిపివేశారన్నారు. జూన్ 4న జరిగే వెన్నుపోటు దినాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేసి చంద్రబాబు మెడలు వంచైనా సరే సంక్షేమ పథకాలను అమలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. తెనాలిలో యువకులను పోలీసులు విచక్షణ రహితంగా కొడితే వారిని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుంటే.. గంజాయి, రౌడీషీటర్లను పరామర్శించేందుకు వస్తారా అంటూ హోంమంత్రి మాట్లాడటం బాధాకరమన్నారు.

చంద్రబాబు హామీలు నీటిమీద రాతలు

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పోతిన మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చే హామీలన్నీ నీటి మీద రాతలేనన్నారు. ఆయన హామీలు ఇచ్చారంటే అమలు కావానే అర్థమన్నారు. పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీకి రాబోయే కాలంలో మంచి రోజులు వస్తాయని.. కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామన్నారు. పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, నూరిఫాతిమా మాట్లాడారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఐఐటీల్లో సీట్లు సాధిస్తాం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ల మనోగతం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గుంటూరు నగరంలో చదివిన విద్యార్థుల్లో అరుగురు అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 200 లోపు ర్యాంకులు సాధించారు. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన సోమిశెట్టి వెంకట సాయిచక్రి అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 33వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయిలోనే ఇది అత్యుత్తమ ర్యాంకు. తండ్రి శ్రీరామమూర్తి వ్యాపారం చేస్తుండగా, తల్లి సుజాత గృహిణి. పదవ తరగతి, ఇంటర్ గుంటూరులోని భాష్యంలో చదివిన సాయి చక్రి టెన్త్‌లో 572, ఇంటర్‌లో 965 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 99.96 పర్సంటైల్‌తో 646వ ర్యాంకు కైవసం చేసుకున్న సాయిచక్రి తాజాగా అడ్వాన్స్‌లో ఓపెన్ కేటగిరీలో 33వ ర్యాంకు సాధించాడు. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరతానని చెబుతున్న సాయిచక్రి సైబర్ టెక్నాలజీ రంగంలో నిపుణుడుగా ఎదగాలనే లక్ష్యంతో ఉన్నాడు. సైబర్‌క్రైమ్‌లను నివారించే ఆశయంతో ముందుకు వెళ్లాలనే ఆత్మ విశ్వాసంతో ఉన్నాడు.

బెంగళూరు ఐఐఎస్సీలో చేరతాను



మా స్వస్థలం గుంటూరు. నాన్న కిషోర్ చౌదరి ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తుండగా, తల్లి పద్మజ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటర్‌గా పని చేస్తున్నారు. టెన్త్ ఐసీఎస్ఈ సిలబస్‌లో 588, ఇంటర్మీడియెట్‌లో 987 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 100 పర్సంటైల్‌తో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించాను. తాజా ర్యాంకుతో బెంగళూరు ఐఐఎస్సీలో బీటెక్‌లో మాథమాటిక్స్ ఇన్ కంప్యూటర్‌లో చేరతాను

గుత్తికొండ సాయి మనోజ్ఞ, 152వ ర్యాంకు

పరిశోధనలు చేయాలనే ఆసక్తి



మా స్వస్థలం గుంటూరులోని ఏటీ అగ్రహారం. నాన్న భాను కృష్ణారావు లోకో పైలెట్. అమ్మ పద్మజ గృహిణి. తాజా ర్యాంకు ఆధారంగా బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో మాథమాటిక్స్ ఇన్ కంప్యూటర్స్ కోర్సులో చేరతాను. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఎం. శ్రీకర గణేష్, 104వ ర్యాంకు

ముంబై ఐఐటీలో చేరతాను



మా స్వస్థలం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం. నాన్న వీరపునాయుడు లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తారు. అమ్మ వసంత గృహిణి. ఆరో తరగతి నుంచే గుంటూరులో చదువుతున్నాను. టెన్త్‌లో 588, ఇంటర్‌లో 984 మార్కులు సాధించాను. తాజా ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరతాను. బీటెక్ తరువాత ఐఏఎస్‌కు ప్రిపేర్ కావాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఎస్. ఆకాష్, 108వ ర్యాంకు

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతాను



మా స్వస్థలం గుంటూరు. నాన్న టి.పిచ్చయ్య, విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. అమ్మ ఇవాంజిలిన్ విజయవాడలోని మేరీ స్టెల్లా కళాశాలలో అధ్యాపకురాలు. కంప్యూటర్ సైన్స్‌కు భిన్నంగా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. ముంబైలో ఈ.ఈ బ్రాంచ్‌లో చేరతాను.

టి.విక్రమ్ లేవీ, 146వ ర్యాంకు

పర్యావరణ పరిరక్షణ దిశగా పరిశోధనలు చేస్తాను



మా స్వస్థలం సత్తెనపల్లి. నాన్న కోటేశ్వరావు ఇనుమెట్ల జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. అమ్మ కోటేశ్వరమ్మ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఐఐటీ ముంబైలో సీఎస్ఈలో చేరతాను. ప్లాస్టిక్ కారణంగా పర్యావరణానికి కలుగుతున్న విఘాతానికి పరిష్కారం చూపేందుకు పర్యావరణ పరిరక్షణ దిశగా పరిశోధనలు చేస్తాను.

డి.జస్వంత్ బాలాజీ, 151వ ర్యాంకు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **1,400** గరిష్టం : రూ. **2,400**

మోడల్ ధర రూ. **1,800**

క్లుప్తంగా

'స్పైసెస్ బోర్డు' ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఎగుమతులు, విలువ జోడింపు – రైతు సాధికారతను పెంచడానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్పైసెస్ బోర్డు స్పైసెస్ట్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తోందని స్పైసెస్ బోర్డు డీడీ ఆనంద్ దేవ్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పైసెస్ బోర్డు 2025–26 ఆర్థిక సంవత్సరానికి 'ఎగుమతి అభివృద్ధి కోసం ప్రగతిశీల, వినూత్న, సహకార జోక్యాల ద్వారా సుగంధ ద్రవ్యాల రంగంలో స్థిరత్వం' అనే ప్రధాన పథకం కింద ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందన్నారు. స్థిరత్వం, ఆవిష్కరణ, ఎగుమతి అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా భారతీయ సుగంధ ద్రవ్యాల రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ మే నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైందని, సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారుల కోసం స్పైస్డ్ పథకం యొక్క ఎగుమతి అభివృద్ధి, ప్రమోషన్ భాగాల కింద దరఖాస్తును ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వాటాదారులు www.indianspices.com ను సందర్శించి దరఖాస్తులను సమర్పించవచ్చని వెల్లడించారు.

పోలీసుల తీరు హేయం

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్



తెనాలిరూరల్: దళిత, మైనార్టీ యువకులపై జనావాసాలు మధ్య బహిరంగంగా, కర్కశంగా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అన్నారు. తెనాలిలో సోమవారం ఆయన మాట్లాడారు. ముగ్గురు బాధితులను అమానుషంగా హింసించడంపై ప్రజా హక్కులు సంఘాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయన్నారు. పోలీసుల చర్యలను సమర్థిస్తూ బాధిత యువకులపై ఎలాంటి గాయాలు లేవని తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన డాక్టర్లతో పాటు సాక్షులుగా ఉన్న వీఆర్వోలను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెనాలి బార్ అసోసియేషన్ బేతాళ ప్రభాకర్, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కొరివి వినయ్ కుమార్, తెనాలి జేఏసీ అధ్యక్షుడు బొనిగల ప్రదీప్, తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్, న్యాయవాదులు గుంటి సురేష్ బాబు, గుమ్మడి రవిరాజు, కంచర్ల కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- పోలీసు పీజీఆర్‌ఎస్‌లో బాధితుల మొర
- ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీలు

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతోనూ, డ్వాక్రా రుణాలు ఇప్పిస్తామంటూ మోసగించారని బాధితులు వాపోయారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్) స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులకు మొబైల్ ద్వారా బాధితుల సమస్యలను వివరించారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ అర్జీలు స్వీకరించారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ బాలింత వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఏఎస్పీ సుప్రజ

బెటాలియన్ హెచ్‌సీ మోసగించాడని ఫిర్యాదు..

మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే ఓ హెడ్‌కానిస్టేబుల్ పరిచయమయ్యాడు. రైల్వేలో టీటీఈ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 2020 అక్టోబర్ 17 నుంచి 2022 జనవరి 20 వరకు దఫాలు వారీగా రూ.8 లక్షలు, 2022 జనవరిలో మరో రూ.10 లక్షలు మా ఇద్దరి వద్ద తీసుకున్నాడు. నకిలీ ఉద్యోగ నియమాక పత్రాలతో దేశంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లాడు. ప్రయాణపు ఛార్జీలు, గదుల అద్దెలు, భోజనపు ఖర్చులకు మరో రూ.10 లక్షలు చెల్లించాం. ఇప్పటివరకు ఉద్యోగాల్లేవు. తిరిగి డబ్బులు చెల్లించలేదు. నగదు విషయమై అడిగితే సరైన సమాధానం లేదు. న్యాయం చేయగలరు.

– కె.రవిచంద్ర, కె.నాగస్నేహిత్, మంగళగిరి

ఏడాదిన్నరగా సహజీవనం చేసి..

పదేళ్ల క్రితం పెళ్లయింది. భర్తతో దూరంగా ఉంటున్నాను. నాలుగేళ్ల క్రితం మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఓ అటెండర్ పరిచయమయ్యాడు. వేరే వ్యక్తితో రెండో పెళ్లి చేసుకుంటానంటే వద్దని వారించాడు. ఇద్దరం ఏడాదిన్నరగా సహజీవనం చేశాం. అతను పనిచేసే కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ప్రస్తుతం చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. పిల్లలను, నన్ను చంపుతానని హెచ్చరిస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపుతానని బెదిరిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయండి

– ఓ మహిళ, గుంటూరు నగరం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ..

తెలిసిన వ్యక్తుల ద్వారా బెంగళూరుకి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఏడాది క్రితం ఇద్దరం కలిసి అతనికి రూ.8.50 లక్షలు చెల్లించాం. నెలలు గడిచిన ఉద్యోగాల ఊసెత్తడంలేదు. ఇటీవల బెంగళూరుకు రావాలంటే అక్కడకు వెళ్లాం. మా డబ్బులు మాకిమ్మని అడిగితే ఇద్దరినీ బెదిరించాడు. ఇష్టానుసారంగా మాట్లాడాడు. మాకు న్యాయం చేయగలరు.

– శైలజ, వర్ష, కాకుమాను మండలం

రుణాలు ఇప్పిస్తామని రూ.లక్షలు కాజేశారు..

ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ పరిచయమైంది. విజయవాడలోని ఓ బ్యాంక్‌లో డ్వాక్రా రుణాలు ఇప్పిస్తామని చెప్పింది. మాతో బ్యాంక్ ఖాతా పుస్తకాలు ఇప్పించింది. అనంతరం పొదుపు డబ్బులు బ్యాంక్‌లో ఐదు నెలలకుగాను రూ.3 లక్షలు చెల్లించాం. ప్రస్తుతం బ్యాంక్‌లో నిల్వ రూ.లక్ష మాత్రమే ఉంది. అయితే ఓ ముగ్గురు కలిసి మిగతా డబ్బులు కాజేశారు. నగదు అడిగామని మాపై దాడికి పాల్పడ్డారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, మళ్లీ మాపై తిరిగి అక్రమ ఫిర్యాదులు చేశారు. పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయగలరు.

– బాధితులు వి.లక్ష్మి, వి.సాయిదుర్గ, షేక్ ముంతాజ్, మహాలక్ష్మి, ఎర్రబాలెం, మంగళగిరి

వెన్నుపోటుకు పేటెంట్ చంద్రబాబుదే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, పోతిన మహేష్, బలసాని కిరణ్‌కుమార్, అంబటి మురళీకృష్ణ, వేమారెడ్డి, నూరి ఫాతిమా తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- ఏటుకూరులో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఈవిషయంలో పేటెంట్ ఆయనదేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని ఏటుకూరు బైపాస్ నందున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంపై కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు తనకు పిల్లను ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నాడన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తా.. ఆదాయాన్ని సృష్టిస్తా అని అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి నేడు రాష్ట్రంలోని ప్రజలకు పథకాలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచాడన్నారు.

సంపద సృష్టి పేరుతో పేదల కష్టం దోపిడీ

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను వెన్నుపోటు పొడిచాడన్నారు. సంపద సృష్టి పేరుతో గ్రామాల్లో వీధికి నాలుగు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులా పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నాడన్నారు. పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు పేదలు సంతోషంగా ఉంటే నచ్చదని పేదలను అణగదొక్కేందుకు ఎల్లప్పుడూ చూస్తుంటాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా నేటికి ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారన్నారు. దానికి తోడు నిత్యం వేల కోట్ల అప్పులు చేసి నేటికి ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చాడన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన ఉదయం 10 గంటల నుంచి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని నియోజకవర్గంలోని పాత మల్లాయపాలెం గ్రామంనందున్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించి అక్కడినుంచి ర్యాలీగా వెళ్లి ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ, నగర అధ్యక్షురాలు, ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరి ఫాతిమా, మంగళగిరి ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్

లక్ష్మీపురం: వ్యసనాలకు అలవాటు పడిన భర్తను వదిలి పుట్టింట్లో ఉంటూ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న మహిళను ఆమె భర్త కత్తి పొడిచి గాయాలపాలు చేశాడు. నిందితుడిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కొబాల్డ్‌పేటకు చెందిన మెరిగల రాజేష్, కల్పనకు 2014లో వివాహం అయింది. రాజేష్ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే కొంతకాలంగా రాజేష్ వ్యసనాలకు అలవాటు పడి మద్యం సేవిస్తూ భార్యను వేధించడం ప్రారంభించాడు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక కల్పన ఏడాది క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలను పోషించేందుకు చంద్రమౌళినగర్‌లోని సంస్థలో చిరు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అయితే రాజేష్ మద్యం సేవించి పిల్లలు కావాలంటూ, కాపురానికి రావాలంటూ భార్య పని చేసే ప్రదేశానికి వెళ్లి వేధిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గత నెల 25న రాత్రి ఆమె పనిచేసే ప్రదేశానికి వెళ్లి వాగ్వివాదానికి దిగిన రాజేష్ వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి తీవ్ర గాయాలపాలు చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు కల్పనను హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. సమచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటన జరిగిన ప్రదేశంలో విచారించి, బాధితురాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాడు. నిందితుడు ఉడాయించడంతో అతనికోసం గాలింపు చేపట్టారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ తరంగిణిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కొబాల్డ్‌పేట 7వ లైన్‌లో నిందితుడు ఉన్నట్లు తెలియడంతో మెరిగల రాజేష్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు

జెడ్పీలో ఉద్యోగుల బదిలీలు

కౌన్సెలింగ్ ద్వారా 91 మందికి స్థాన చలనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో 91 మంది ఉద్యోగులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ వి.జ్యోతిబసు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ ఒక చోట ఐదేళ్లు విధులు నిర్వహించిన వారిని ఇతర ప్రాంతాలకు తప్పనిసరిగా బదిలీ చేస్తున్నామని, ఖాళీగా ఉన్న ప్రాంతాలకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బదిలీల్లో భాగంగా ఏడుగురు పరిపాలనాధికారులతో పాటు ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది టైపిస్టులు, ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లు, 39 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఒక నైట్ వాచ్‌మెన్ బదిలీ అయ్యారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, ఏఓ రాజారత్నం పాల్గొన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈఓ జ్యోతిబసు

అమానుష దాడిపై పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు

పట్నంబజారు: తెనాలి పోలీసుల అమానుష దాడికి గురైన బాధితులు జాన్ విక్టర్ తండ్రి ఇజ్రాయిల్, రిమాండ్‌లో ఉన్న మరో బాధితుడు దోమ రాకేష్ తల్లిదండ్రులు సోమవారం గుంటూరులోని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ రాయపూడి మాణిక్యారావును కలిశారు. వారిపై జరిగిన దాడిని వివరించారు. ఐఎల్‌పీఏ తరఫున బాధితుల పక్షాన కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. బాధితులపై జరిగిన దాడిని గుంటూరు ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాయపూడి మాణిక్యారావు మాట్లాడుతూ ఘటనను చట్టపరంగా విచారించి, దీనిపై జూడీషియల్ విచారణ చేయించాలని కోరారు. అలాగే పోలీసుల నుంచి బాధితులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదిపై దుర్భాషలాడుతూ చేసిన దాడిని ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన ఇన్‌చార్జి కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో పోటీపడాలి

గుంటూరు వెస్ట్: దివ్యాంగులు అన్ని రంగాల్లోనూ పోటీపడాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆరుగురు దివ్యాంగులకు ల్యాప్‌ట్యాప్‌లు బహూకరించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.



దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

ఇద్దరికి కారుణ్య నియామకపత్రాలు..

ఇద్దరికి ఆయా శాఖల్లో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో తాడిశెట్టి ఎస్‌ఎస్‌కే కుమార్‌కు పోలీసు శాఖలోనూ, బుళ్ల శృతికి రెవెన్యూ శాఖలో ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత

గుంటూరు వెస్ట్: కాలుష్య నియంత్రణను సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లు, గుడ్డ సంచులను ఆవిష్కరించారు.

సుద్ధపల్లిలో వ్యక్తి దారుణహత్య

వివాహేతర సంబంధమే కారణం



మృతుడు కొమ్మూరి గోపయ్య(ఫైల్)



సుద్ధపల్లిలో కొమ్మూరి గోపయ్య హత్యపై విచారిస్తున్న ఎస్ డి.వెంకటకృష్ణ

చేబ్రోలు: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సోమవారం సుద్ధపల్లిలో చోటు చేసుకుంది. చేబ్రోలు మండలం సుద్ధపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి గోపయ్య(35)ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హతమార్చారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చేబ్రోలు సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి తల్లి కొమ్మూరి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకటకృష్ణ తెలిపారు. మహిళకు ఇద్దరు వ్యక్తులతో ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం కారణంగానే ఈ హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఆత్మరక్షణ కోసం ఆయుధం

- కర్రసాము, తైక్వాండోల్లో రాణిస్తున్న చిన్నారులు
- అంతర్జాతీయ పోటీల్లో పతకాల పంట
- మారుతున్న తల్లిదండ్రుల ఆలోచన ధోరణి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రతి చిన్న సమస్యని పెద్దదిగా చూడడం, ఆందోళన చెందడం, క్రమశిక్షణ లోపించడం తదితర అంశాలను నేటిచిన్నారుల్లో తరచూ చూస్తుంటాం. తల్లిదండ్రుల్లో కూడా తమ పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యతనిచ్చి పెద్ద కళాశాలల్లో సీట్లు సాధించాలనే తపన ఎక్కువగా కనిపిస్తుంది. అయితే కొందరు మాత్రం తమ పిల్లల్ని విద్యావంతులుగానూ ఆత్మ రక్షణ విద్యలోనూ మేటిగానూ చూడాలనుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగా శిక్షణా శిబిరాల్లో చేర్పించి దీటుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలా శిక్షణ పొందిన కొందరు చిన్నారులు పోటీల్లోనూ రాణిస్తున్నారు. గుంటూరు విద్యానగర్‌లోని కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సుమారు 100 మందికిపైగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ అద్భుతంగా రాణిస్తున్నారు. గత నెల 24 నుంచి 26 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన 5వ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 9 బంగారు, 5 రజతాలు 3 కాంస్య పతకాలు సాధించి ఔరా అనిపించారు. అకాడమీ కోచ్ కాశీనాథ్ రెడ్డి ప్రత్యేక శిక్షణలో రాటుదేలుతున్న వీరు కర్రసాముతోపాటు తైక్వాండాలోనూ విశేషంగా రాణిస్తున్నారు.



చిన్నారులకు శిక్షణనిస్తున్న కోచ్ కాశీనాథ్ రెడ్డి

ఆర్మీలో చేరతాను



అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించాను. తైక్వాండాలో 2వ డాన్ బ్లాక్ బెల్ట్. నేషనల్ మెడల్స్ కూడా ఉన్నాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధన చేస్తున్నాను. నిత్యం ఫిట్‌గా ఉండడంతో ఒత్తిడి ఉండదు. గత 5 సంవత్సరాలుగా సాధన చేస్తున్నాను. ఆర్మీలోగానీ, పోలీస్ శాఖలోగానీ చేరతాను.

– బి.హర్షవర్ధిని, 10వ తరగతి

ఫిట్‌గా ఉంటాను



నాకు అలసట ఉండదు. ఎన్ని గంటలైనా క్లాస్‌లో బోర్ కొట్టకుండా కూర్చుంటాను. కర్రసాము, తైక్వాండో సాధన కారణంగా ఆ శక్తి నాలో ఉంటుంది. 2వ డాన్ బ్లాక్‌బెల్ట్‌తోపాటు కర్రసాములోనూ పతకాలు సాధించాను. పోలీస్ ఉద్యోగమంటే చాలా ఇష్టం.

– డి.శ్రవంత్ కుమార్, 10వ తరగతి

ఎంతో ధైర్యం వచ్చింది



మార్షల్ ఆర్ట్స్ సాధనతో తెలియని ధైర్యం ఉంటుంది. కోచ్ శిక్షణతోపాటు మెడిటేషన్, ఎథిక్స్ గురించి చెబుతుంటారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తాను. అంతర్జాతీయ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు వచ్చాయి. తైక్వాండోలో 2వ డాన్ సాధించాను. అమ్మ నాన్న కూడా బాగా ప్రోత్సహిస్తారు. ఆర్మీలో చేరి, దేశ సేవ చేస్తాను.

– వి.హంసిని మీనాక్షి, 10వ తరగతి

పతకాలు ఆత్మ స్థైర్యాన్ని పెంచాయి



ఇటీవల ముగిసిన అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించాను. ఆ విజయం నాలో ఆత్మ స్థైర్యాన్ని పెంచింది. తైక్వాండాలోనూ జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించాను. 2వ డాన్ బ్లాక్ బెల్ట్ ఉంది. నిత్యం సాధన కొనసాగిస్తుంటాను. మరిన్ని పోటీలకు సిద్ధపడుతున్నాను.

– బి.రమ్యశ్రీ రెడ్డి, 7వ తరగతి

తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది



నేను 20 ఏళ్ల నుంచి తైక్వాండో, 8 సంవత్సరాల నుంచి కర్రసాము నేర్పిస్తున్నాను. ప్రస్తుతం 100 మంది పిల్లలున్నారు. ఈ మధ్య తల్లిదండ్రుల ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. తమ పిల్లలను క్రీడా, ఆత్మరక్షణ శిక్షణకు తీసుకువస్తున్నారు. అదే విధంగా రిజల్ట్ కూడా ఉంటుంది. మా అకాడమీ పిల్లలు సాధనతోపాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభకనబరుస్తున్నారు.

– బి.కాశీనాథ్ రెడ్డి, చీఫ్ కోచ్, గుంటూరు